# ఉయ్యాల ఊపే చెయ్యి




సత్యమూర్తి అయిదుగంటలకల్లా బయటికొచ్చి బస్‌స్టాప్‌లో నిలబడ్డాడు. రోజూకన్నా ఈవేళ కొంచెం ధీమాగా, ధైర్యంగా, దర్జాగా ఛాతీ విరుచుకుని నిలబడాలనుకున్నాడు. కానీ గుండె కొంచెం వేగంగానే కొట్టుకుంటోంది.

ఇవాళ కొంచెం సాహసం చెయ్యబోతున్నాడు. అంటే ఎవరెస్టు శిఖరం ఎక్కబోతున్నాడని కాదు...ఇంతమంది తమవంక కళ్ళప్పగించి చూస్తుండగా తను సువర్ణ చెయ్యిపట్టుకొని, వెంటబెట్టుకుని నడవటం—ఒకరకంగా తనకు ఎవరెస్టు శిఖరం ఎక్కినంతపనే.

టైం చూసుకున్నాడు. అయిదూ అయిదు. అడ్డదిడ్డంగా నిలబడ్డ జనం మధ్యకు దృష్టిని సారించి వెతుకుతున్నాడు...ది రోజ్ కలర్ శారీ...

సువర్ణను ఇంతవరకూ ఎప్పుడూ చూడలేదు. మనిషిగూడా పేరులాగానే అందంగా ఉండి ఉంటుంది. సువర్ణాన్ని చూర్ణంచేసి, " ఆ చూర్ణంతో కత్తిరేని

బంగారు బొమ్మను చేసి, ప్రాణంపోసి, పాలికేళ్ళు కంటికిరెప్పలా కాపాడి, ఇవాళ తనకు అప్పగించబోతున్నాడు, సృష్టికర్త, డిగ్రేట్...రోజ్ కలర్ శారీ, మాచింగ్ బ్లౌజు, ఎర్రని హ్యాండ్ బేగ్... నడవటానికి నేలమీద రెడ్ కార్పెట్ ఒక్కటే తక్కువ.

సెక్రటేరియేట్ ముందున్న బస్ స్టాపులన్నీ కిటకిట లాడుతున్నవి. అవుట్ గేటులోనుంచి చీమల పుట్టలో నుంచి వచ్చినట్లు బారులు తీరి వస్తూనే ఉన్నారు. ఇటునుంచి తీమాకంపెనీ వారూ, అటునుంచి డ్రామా కంపెనీ వారూ, ఏజీవారూ, మింటువారూ, అంటు వారూ...

మలక్ పేట కాలనీ వారి క్యూ కడుపు లోని పెద్దపేగులాగా మడతలు పడిఉంది. షెడ్‌లోని అమ్మాయిలంతా వారపత్రి కలు బట్టీ పట్టేస్తున్నారు. మిగిలినవాళ్ళు చిన్నగా కబుర్లాడుకుంటూ, చిరునవ్వుల పువ్వుల్ని పెదవులమీద పూయిస్తు న్నారు.

సనత్‌నగర్ బస్సురాగానే ఈగల్లా మూసిరారు. చూస్తుండగానే బస్సునిండి పోయింది. కొందరు గబ్బిలాల్లా కడ్డీలు పట్టుకుని వేళ్ళాడుతున్నారు- పొద్దున్నా సాయంత్రం, అందాల చేతులు కందేను పాపం...

ఇంకా అనేక మూలలకు వెళ్ళవల్సిన అనేకమంది జనం, రావల్సిన బస్సుల ఆగమనంకోసం, చంద్రుడికోసం చకోర పక్షుల్లా ఎదురుచూస్తున్నారు.

సత్యమూర్తి గూడా కళ్ళింత చేసు కుని చూస్తున్నాడు, గులాబీరంగు చీర కోసం, రవికె కోసం.

సువర్ణ రాజహంసలా ఇప్పుడిక్క డికి నడిచి వస్తుంది ; ఇంద్రుడి సభలోకి ప్రవేశించే రంభలా, పున్నమినాటి నంజె వేళ తూర్పునుంచి చీకట్లను తరుము కుంటూ, పండువెన్నెలలు వెదజల్లు కుంటూ వచ్చే నిండు చంద్రబింబంలా, శతదినోత్సవంనాడు కన్నులపండుగగా ప్రేక్షకులముందుకు తరలివచ్చే తెలుగు తెర తారలా - సువర్ణ ఇప్పుడిక్కడికి వస్తుంది...

ఆమె అలా కదలికెరటంలా కదలి వస్తూంటే, సహజంగానే మగవాళ్ళంతా అశతోను, ఆడవాళ్ళంతా ఈసుతోను సువర్ణవంక ఇంతలేసి కళ్ళతోవింతగా చూస్తారు. వీళ్లెవర్నీ లెక్కచెయ్యకుండా సువర్ణ తిన్నగా తన దగ్గరికివచ్చి, తియ్యగా నవ్వుతూ, కళ్ళల్లోకి కళ్ళు గుచ్చి చూస్తూ నిలబడుతుంది. తాను ఎంతో పరిచయం ఉన్నవాడిలా ఆమె భుజంచుట్టూ, తన చేతిని చుట్టి వెంట నడిపించుకుని వెళ్తాడు. ఆమె మృదు వుగా మాట్లాడుతూ, మువ్వలు మ్రోగించి నట్టు నవ్వుతుంది. వీరంతా నిరాశోప హతులుకాగా, తాముమాత్రం అలా ఆటోలో ఎటో వెళ్ళిపోతారు ; వీళ్ళల్లో

కొద్దిమంది అతనికి బాగా తెల్సు. కొంత మందికి ఓ మాదిరిగా తెల్సు. చాలా మందికి బొత్తిగా తెలియదు. కానీ ఇవాళ సువర్ణతో తాను వెళ్ళటం చూసి అంతా నోళ్లువెళ్ళబెట్టేస్తారు. ఇదీ తన ఎడ్వెంచర్...

భయం భయంగా బ్రతుకుతుంటే, చచ్చేదాకా ఇంతే. కొంతధైర్యం, కొంత చొరవా, కొంత స్వేచ్ఛా, మరికొంత సౌందర్యారాధనా, ఇవన్నీ కలిపి చేసిన టానిక్ బావుంటుంది. లేకుంటే లైఫ్ అంతా మెకానికల్...బోర్, బోర్...

అసలు సత్యమూర్తికి సువర్ణ తెల్సా అంటే తెల్సు అని చెప్పటానికి వీల్లేదు. తెలియదా అంటే బొత్తిగా తెలియదని చెప్పటానికీ వీల్లేదు. వాళ్ళ పరిచయం చాలా గమ్మత్తుగా అయింది.

సత్యమూర్తి ఎందుకో సువర్ణవాళ్ల ఆఫీసుకు ఫోనుచేశాడు. అక్కడ సువర్ణ టెలిఫోను ఆపరేటర్. ఫలానా అతను కావాలని అడిగాడు. అతను లేడు. తన వివరాలు చెప్పి రాగానే చెప్పమన్నాడు. మర్నాడు మళ్ళీ చేశాడు. అయినా తన పని పూర్తికాలేదు. మూడోరోజూ ఆ స్నేహితుడు రాలేదు. ఈ రెండు రోజులూ తన వివరాలుమాత్రమే ఆమెతో చెబుతూ వచ్చాడు. మూడో రోజు తనకు కావల్సిన పనిగూడా చెప్పి కనుక్కోగలరా అని కోరాడు. ఆ మధ్యాహ్నం ఆమె మళ్ళీ ఫోనుచేసి తన పని పూర్తయినట్లు చెప్పింది. అప్పుడు సువర్ణ పేరూ, వివరాలూ, విషయాలూ అడిగాడు. అమ్మో,ఆ పిల్ల చాలా తెలివి గలది : అన్నీ చెప్పినట్లే, ఏమీ చెప్ప నట్లే...

ఇక్కడ సత్యమూర్తి బాస్ ఎప్పుడూ నెలకు ఇరవై రోజులు కాంప్‌లోనే ఉంటాడు ఆయన లేనప్పుడు ఇతనికి అంతగా పనేమీ ఉండదు, టెలిఫోను ముందు కూర్చుని ఆయనలేరనిచెబుతూ, మధ్యమధ్య ఈగలుతోలుకోవటం తప్ప. అలాంటప్పుడు సువర్ణ గుర్తుకొచ్చేది. నెంబరు తిప్పి, కోయిల కంఠాన్ని వినేవాడు.

'లంచ్ అయిందా...ఏం తెచ్చారు... మీరొక్కరే తినటం అన్యాయంకదా... ఫోనులో తినిపించటం ఎలాగంటారా, మనసుంటే మార్గంలేదా...మీరు చాలా తెలివిగా మాట్లాడుతారుసుమా ... పోన్లెండి, అంతమాట అన్నారు, అద యినా చాలు—'

ఇలా రెండు నెలలనుంచీ సత్య మూర్తికీ,సువర్ణకీ బోలెడు దోస్తీ కుదిరి పోయింది. వంటింటి విషయాలు, ఇంటి విషయాలూ, ఒంటి విషయాలూ,ఒంటరి విషయాలు, — అటువంటి విషయా లెన్నో దొర్లుతుండేవి వాళ్ళ సంభా షణలో.

మొత్తంమీద సత్యమూర్తి తెల్సుకో గలిగింది ఏమిటంటే, ఆమె ఈ ఊళ్ళో

ఒక్కతే ఉంటోంది, ఇంకో ఫ్రెండ్‌తో కల్సి

ఆ మాట చెప్పగానే "నేను మాత్రం మీ ఫ్రెండ్‌ను కాదా ?" అని అడిగాడు.

"కాదనలేదే..."

"అవునని అంటే మీ సొమ్మేం పోయిందో? బొత్తిగా నెగిటివ్ ఎప్రోచ్."

కిలకిలమని నవ్వితే, "మీకు పాట లొచ్చా" అని అడిగాడు.

"ఏమో? పెళ్ళివారు అడగవల్సిన ప్రశ్నలన్నీ మీరే అడుగుతున్నారు?"

"అందుకు మాకు అర్హత లేదా? ఇంతకీ నాకు సమాధానం రాలేదు."

"మీకు పాటలే కావాలంటే,కుదరదే. ఇది మాటలవరకే...నేను అనేది ఫోను సంగతి..."

"నేను అడిగేది మీ సంగతి..."

"దేనికిట?"

"మరేంలేదు, రేపు పిల్లల్ని నిద్ర పిచ్చటానికి..."

"అని మమ్మల్ని మాయబుచ్చ టానికి..." మళ్ళీ నవ్వు.

"అడిగినదానికి సమాధానం రాదు గదా. కోయిలకు పాటలు రాకుండా ఉంటాయా?"

నేనంత నల్లగా ఉంటాననా మీరు అనటం?"

"సువర్ణ నల్లగా ఎలా ఉంటుంది?"

"ఉండకపోవటమే,? బోలెడంత సువర్ణం నలుపులో ఉందని అంచనా.."

"యు ఆరే హార్డ్‌నట్..."

"థాంక్స్‌ఫర్ ద కాంప్లిమెంట్"

ఇలా ఎన్నో...ఎన్నెన్నో...సువర్ణ సత్యమూర్తి చాలా దగ్గరవాళ్ళు అయి నారు. అయినా 'గమ్మత్తు ఏమిటంటే, ఇతనెవరో ఆమెకు తెలియదు. ఆమె ఎవరో ఇతనికి అంతకన్నా తెలియదు. ఎదురుపడ్డా గుర్తుపట్టుకోలేరు.ఏదో రోజూ ఫోనులో మాటలు పెంచుకుని, మమ తలు పెంచుకోవటమేగాని, ఎన్నడన్నా మనుష్యులు ఎదుటపడితేగా, మనసులు కుదుటపడితేగా...

ఇవాళ ఎందుకో సువర్ణ గొంతుక చాలా దిగులుగా వినిపించింది. కంగారు పడ్డాడు సత్యమూర్తి. కారణం అడిగాడు సువర్ణను. ఏదో అవసరంగా ఊరికి వెళ్ళాలని చెప్పింది.

"పెళ్ళిచూపులనుకుంటాను..."

"కాదు."

"మరెందుకంత నీరసం?"

"నెలాఖరుకదా. ఇప్పుడు ప్రయాణం అంటే ఎలా?"

"దానికే ఇంత దిగులా ? నాతో ఒక మాట చెప్పగూడదా?"


"ఏమనుకుంటారో?"

"ఇంతేనన్నమాట నన్నర్థం చేసు కుంది? ఎంత కావాలి?"

"రెండు"

"చాలా?"

"చాలు..."




"ఎక్కడ?"

"సాయంత్రం. బస్‌స్టాప్‌లో..."

తన గుర్తులు చెప్పింది. గులాబీ రంగు చీర, అదే రంగు జాకెట్...తన గుర్తులూ చెప్పాడు.

అయిదున్నర. చాలా బస్సులు వచ్చేసి విడిదిదేసి ఉన్నాయి. జనం అంతా ఎటువాళ్ళు అటు సర్దుకుంటున్నారు. సువర్ణ తొందరగా వస్తే బావుండును...

"బాబూ..."

ఉలిక్కిపడి, వెనక్కి తిరిగి చూశాడు.

"సైదాబాదు వెళ్ళేబస్సు రాదా?" అని అడిగింది ఒక వయసుమళ్ళినామె.

"వస్తుంది, రావాలి..." అని చెప్పాడు మళ్ళీ.

"ఇక్కడినుంచి సైదాబాదుకు టిక్కెట్టు ఎంతఉంటుంది బాబూ" అని అడిగిందామె మళ్ళీ.

సత్యమూర్తి విసుగ్గా ఆమె వంక చూశాడు.

"ఇద్దరికీ అర్థరూపాయి సరిపోతుందా?" కొద్ది జంకుతూ అడిగింది. సత్యమూర్తికి అంతలోనే జాలివేసింది. పాపం అనిపించింది.

"ఇద్దరికీ అర్థరూపాయి చాలదమ్మా... కనీసం రూపాయైనా అవుతుంది" అన్నాడు సత్యమూర్తి.

"అయ్యో, ఇప్పుడెట్లాగురా మరి?" అని అడిగిందామె పక్కనున్న కుర్రాడి వంక తిరిగి. ఆమె పక్కన ఉన్న పిల్లవాడికి దాదాపు పదిహేను సంవత్సరాలు ఉంటాయేమో. ఒక కంటికి అద్దంఉంది. మరోకంటికి పచ్చగుడ్డ కట్టుకున్నాడు.

ఈమె అడిగినదానికి ఆ అబ్బాయి ఏమీ బదులు చెప్పలేదు.

"ఆయన ఉంటే అయిదో, పదో ముట్టజెప్పకుండా ఉండేవాడుకాదు ... ఇంతకీ మన అదృష్టం అలాఉంది..." అన్నదామె కుర్రాడితో.

కొద్దినిముషాలు మౌనంగా ఉండి పోయింది. సత్యమూర్తి కళ్ళు మళ్ళీ సువర్ణకోసం వెతకడం మొదలుపెట్టాయి

"చూడుబాబూ, ఒక అర్థరూపాయి ఉంటే దానంచెయ్యండి.బస్సుకు డబ్బులు లేవు..."

సత్యమూర్తి దగ్గర డబ్బుఉన్నది. సువర్ణకోసం రెండువందలు దాచేశాడు. పైఖర్చుకోసం ఇంకో ఇరవై జేబులో ఉంచుకున్నాడు చిల్లర బొత్తిగాలేదు. అతను ఆలోచనలో పడ్డాడు. ఇతను సంశయించటంచూసి ఆమె మళ్ళీ నోరు విప్పింది.

"మేమూ బాగా బ్రతికినవాళ్ళమే బాబూ. మావారు రామనాధశాస్త్రిగారని తెనాలిలో గొప్ప వకీలుగా ఉండేవారు. ఆయన ఉన్నరోజుల్లో, ఎందరికో మా ఇంట్లో, ఆశ్రయం ఇచ్చాం..."

సత్యమూర్తికి ఒళ్ళు ఝల్లుమంది. ఆశ్చర్యంగా, ఆమెవంక చూశాడు. ఆత్రంగా ఎవరి పోలికలకోసమో, ఆమె ముఖంలో వెతకటం మొదలుపెట్టాడు.

"తెనాలిలో ఎక్కడమ్మా మీ ఇల్లు?"

"టవున్‌హాలు పక్కవీధిలో ఉండే వాళ్ళం ... మావారు ఉన్నరోజుల్లో మేమూ. అన్నీ అనుభవించినవాళ్ళమే బాబూ. చెబితే మీరు నమ్మరుగాని, రోజుకు పదిమందికి తక్కువలేకుండా దానంచెయ్యటం ఆయనకే చెల్లింది. చేసిన పుణ్యమంతా ఏ నట్టేట కల్సిపోయిందో గాని,ఆయన దాటిపోగానే మా గీత మారి పోయింది. అదంతా ఒక కలలా అయి పోయింది. మా సిరి అంతా కరిమింగిన వెలగపండులా అయిపోయింది"

వింటున్న సత్యమూర్తి కంఠం రుద్ధమైపోయింది. ఏదో గొంతులో అడ్డుపడింది. అయినా పెకలించుకుని అడిగాడు "ఇక్కడికి ఏం పనిమీద వచ్చారమ్మా?"

"ఏం చెప్పమంటావు నాయనా. కష్టాలన్నీ ఒక్కసారిగా చుట్టుముట్టి నయి. ఈ దరిద్రానికి తోడు, ఈ పిల్ల వాడికి కంటిచూపు మందగించింది. క్రమంగా చూపుపోతుందని చెబితే,భయ పడి సరోజినీ ఆస్పత్రిలో చూపిద్దామని తీసుకొచ్చాను బాబూ..."

"మరి, ఇక్కడికి..."

"ఇన్సూరెన్సు కంపెనీలో మావారికి తెల్సినాయన ఉండాలి. ఆయనతో చెప్పుకుంటే, గుండె కరగకపోతుందా, దయ రాకపోతుందా _ ఏదన్నా కాస్త డబ్బుసాయం చెయ్యకపోతారా అని వచ్చాను బాబుగారూ. కని నెత్తిన తాండ విస్తుంటే, ఏం చెయ్యగలం... ఆయనకు-

బదిలీ అయి ఎక్కడికో వెళ్ళిపోయారుట. ఇప్పుడు మాకు ఇంటికి పోవటానికి డబ్బులులేవు...ఒక అర్ధరూపాయుంటే ఇస్తారా బాబూ..." అని చెయ్యిచాచింది.

సత్యమూర్తికి కళ్ళుతిరుగుతున్నాయి. భూమి బద్దలైపోయి. తాను అందులోకి క్రుంగిపోతున్నాడు. చుట్టూ ఇప్పుడిక్కడ ఇంతమంది లేకపోతే, ఆమె పాదాలమీద పడిపోయి ఉండేవాడు...

అయ్యో!...ఎలాంటితల్లికి, ఎటువంటి దురవస్థ కలిగింది! రామనాధశాస్త్రి గారిల్లు నిజంగా ధర్మసత్రంలాంటిదే. ఆమె చెప్పిందాంట్లో అబద్ధంలేదు. ఒక్కచేతిమీద సంపాదించింది, రెండుచేతుల మీదా ఖర్చుపెట్టేవాడు. వచ్చిన పార్టీ లందరికీ భోజనాలు, పడకలు—ఈమె పని.

తాను వారింట్లో వారాలు చేసుకుని తిన్నాడు. ప్రతి బుధవారం పొద్దున్నా సాయంత్రం ఈ తల్లిచేతిమీదిగా తనకు వడ్డించేది. అప్పుడీ పిల్లవాడు ఉయ్యాల్లో ఉండేవాడు. ఒకచేత్తో ఆ పిల్లాణ్ణి ఊపుతూ, ఒకచేత్తో తనకి వడ్డించేది

"తినరా వెధవా, ఈ వయసులో సుబ్బరంగా తిని, చదువుకోవాలి. రేపు నువ్వో పెద్ద ఆఫీసరువు కావాలి..." అని దీవించేది.

అప్పుడా ఉయ్యాల ఊపినచెయ్యేనా, అప్పుడు తనకు అన్నంపెట్టి, దీవించిన ఆ చల్లని హస్తమేనా, ఇప్పుడు తనని బిచ్చం అడుగుతున్నది?...ఎంత బండ్లు ఓడలు, ఓడలు బండ్లు అయితే మాత్రం ఇంత గుండెను ముక్కలుగా కోసే దృశ్యమా తను చూడవల్సింది?

సత్యమూర్తికి దుఃఖం ముంచుకొచ్చింది. తన కొలుకులనుంచి ముత్యాల్లాంటి కన్నీటిబిందువులు జలజలమని రాలిపడినయి.దుఃఖంతో అతని గొంతుక పూడిపోయింది, ఏం మాట్లాడుదామన్నా పెగ్లేకుండా.

తన ప్రయత్నం లేకుండానే తన దగ్గరున్న రెండువందల ఇరవైరూపాయలూ ఆమెచేతిలో పెట్టాడు. ఆమె తన కళ్ళను తనే నమ్మలేనట్టు, తన చేతిలోని నోట్లవంక, అతని ముహం వంక మార్చి, మార్చి చూసింది

"ఉంచండమ్మా" అని కళ్ళు తుడుచుకుని, పక్కకు తిరిగిచూశాడు.

ఎదురుగా రోజ్ కలర్ శారీ, బ్లౌజ్.. నవ్వుతూ, వెన్నెలకన్నా చల్లగా, తెల్లగా...మెల్లగా దగ్గరవుతూ...

